క్లుప్తంగా

29న మహా ప్రవక్తపై ప్రసంగం

కడప కల్చరల్ : మహా ప్రవక్త మహమ్మద్ (సా.అ.వ) జన్మదిన మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 29వ తేదీన నగరంలోని గుంతబజారులోని మసీదులో ఆధ్యాత్మిక ప్రసంగం నిర్వహించనున్నారు. సాయంత్రం అసర్ నమాజ్ తర్వాత 6.45 నుంచి రాత్రి 8.00 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉలేమా అయిమ్మ కమిటీ ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమానికి నగర ప్రముఖులు హాజరుకానున్నారు. పలువురు ప్రముఖ బోధకులు కూడా రానున్నారు.

డిగ్రీ కళాశాలలకు దసరా సెలవులు ప్రకటించాలి

వైవీయూ: వైవీయూ పరిధిలోని డిగ్రీ కళాశాలలకు దసరా సెలవులు ప్రకటించాలని ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ), ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం (జీసీజీటీఏ) నాయకులు కోరారు. గురువారం వైవీయూలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య రఘునాథరెడ్డిని సంఘ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. జేఏసీ నాయకులు డాక్టర్ ఆర్. నీలయ్య, డా. నాగభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు ప్రకటించిన విధంగానే డిగ్రీ కళాశాలలకు కూడా అక్టోబర్ 4 నుంచి 11వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించాలని కోరారు.

కాశీలో పిండ ప్రదానం



కాశీలో సామూహికంగా పిండప్రదానం చేస్తున్న కడపకు చెందిన మేము సైతం సభ్యులు

కడప అర్బన్: కడపకు చెందిన మేము సైతం సేవాసంస్థ ఆధ్వర్యంలో వారణాసి కాశీలో సంస్థ ప్రతినిధులు గురువారం సామూహికంగా పిండ ప్రదానం నిర్వహించారు. తమ సంస్థ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 879 మంది అనాథలకు అంత్యక్రియలను చేశామనీ, వారి ఆత్మలకు శాంతి చేకూర్చేందుకు మహాలయ అమావాస్య రానున్న సందర్భంగా గురువారం పిండ ప్రదానం కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో అయ్యవారయ్య, రాము, రామలోకం, టి.టి.డి రాజేష్, మురళి, షామియానా సురేష్, గురవయ్యా, నరసింహ, మేము సైతం సేవాసంస్థ ప్రతినిధులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



కళాశాల ఎదుట నిరసన చేపడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ వద్ద ఉన్న శ్రీ చైతన్య బ్రాంచ్‌లో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న అల్తాఫ్ అనే విద్యార్థికి పరీక్షలలో మార్కులు తక్కువ వచ్చాయని లెక్చరర్ విచక్షణ రహితంగా కొట్టడం సరికాదని ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు ఆభిరానందన్ పేర్కొన్నారు. గురువారం శ్రీ చైతన్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర సహాయ కార్యదర్శి చంద్ర, ఉపాధ్యక్షులు అశోక్ , ఫహద్, కోశాధికారి రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

తలరాతలు మార్చే భగవద్గీత

కడప కల్చరల్ : భగవద్గీత పఠనంతో మానసికమైన పరిణితి లభిస్తుందని డాక్టర్ చింతకుంట శివారెడ్డి అన్నారు. కడప నగర పరిధిలోని విశ్వనాథపురం శివాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో హిందూ ధర్మప్రచార పరిషత్, కడపశాఖ తరపున టీటీడీ సూపరింటెండెంట్ ఇ.ఢిల్లీరెడ్డి, ప్రోగ్రాం అసిస్టెంట్ టి.గోపీబాబు పర్యవేక్షణలో 'ఆధునిక కాలానికి భగవద్గీత ఆవశ్యకత' అనే అంశంపై గురువారం ఆధ్యాత్మిక ప్రసంగం నిర్వహించారు. కార్యక్రమంలో శివాలయం అర్చకులు శ్రీకాంత్ స్వామి, విశ్వనాథపురం భక్తులు పాల్గొన్నారు.

కూలీ రేట్లు పెంచాలి



నిరసనలో మాట్లాడుతున్న కేసీ బాదుల్లా

కడప సెవెన్‌రోడ్స్ : పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పౌర సరఫరాల శాఖలో పనిచేస్తున్న హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. గురువారం సివిల్ సప్లయ్ గోడౌన్ వద్ద రాష్ట్ర పిలుపులో భాగంగా నిరసన కార్యక్రమాన్ని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. బాదుల్లా మాట్లాడుతూ ఎగుమతులు, దిగుమతులపై క్వింటాలుకు రూ. 35 ఇవ్వాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు, హాస్టళ్లకు మధ్యాహ్న భోజన పథకానికి నిత్యావసరాలను సరఫరా చేయడంలో హమాలీలది కీలకపాత్ర అన్నారు. రెండేళ్లకు ఒకసారి కూలీ రేట్లు పెంచుతామని ఒప్పందం జరుగుతుందన్నారు. అయితే గత సంవత్సరం డిసెంబరుతో ఒప్పందం ముగిసినా కొత్త కూలీ రేట్లు పెంచకపోవడం విచారకరమన్నారు.

వర్చువల్ బోధన సాగేదెలా..?

- హైస్కూళ్లలో ల్యాప్‌టాప్‌లు వెనక్కి తీసుకుంటున్న విద్యాశాఖ
- ఆన్‌లైన్ వివరాలు ఎలా పంపాలని ప్రశ్నిస్తున్న హెచ్‌ఎంలు
- ఎలాంటి ఉత్తర్వులు లేకుండా ఉన్న ఫళంగా వెనక్కు



వర్చువల్ విధానంలో తరగతి గదిలో బోధన (ఫైల్)


కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 103 ఉన్నత పాఠశాలల్లో వర్చువల్ విధానంలో విద్యా బోధన కొనసాగించడానికి వీలుగా 2016–17లో ప్రభుత్వం ల్యాప్‌టాప్‌లను సరఫరా చేసింది. వీటి ద్వారా ఆయా ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేసేవారు. అదే విధంగా ఉన్నత పాఠశాలలకు సంబంధించిన అన్ని రకాల ఆన్‌లైన్ వివరాలను నమోదు చేయడానికి, నమోదు చేసిన వివరాలను అప్‌లోడ్ చేయడానికి ప్రధానోపాధ్యాయులు ఈ ల్యాప్‌టాప్‌లను వినియోగించేవారు. అయితే ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ అధికారులు చెప్పారని జిల్లా విద్యాశాఖ అధికారులు ఎంఈఓల ద్వారా ఆయా ఉన్నత పాఠశాలల నుంచి ల్యాప్‌టాప్‌లను వెనక్కు తెప్పించి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డిపాజిట్ చేయాలని ఆదేశించారు. దీంతో ఎంఈఓలు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వద్ద ఉన్న 103 ల్యాప్‌టాప్‌లకుగాను ఇప్పటి వరకు 70 జిల్లా విద్యాశాఖ అధికారులకు అందచేసినట్లు తెలిసింది.

వెనక్కి ఇచ్చేందుకు విముఖత...

జిల్లాలోని కొన్ని ఉన్నత పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు మాత్రం ల్యాప్‌టాప్‌లను వెనక్కు ఇచ్చేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఎందుకంటే ప్రధానోపాధ్యాయులందరూ వీటి ద్వారా పాఠశాలల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుకు ఉపయోగిస్తున్నారు. ఎటువంటి రాత పూర్వక అధికార ఉత్తర్వులు లేకుండా, ఏ విధమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ఉన్న ఫళంగా వెనక్కు తీసుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. సాంకేతిక పరమైన ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని కొంతమంది ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు.

- ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఈ ల్యాప్‌టాప్‌ల ద్వారా వర్చువల్ తరగతులను నిర్వహించడంతోపాటు పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల నమోదు, విద్యార్థుల మార్కుల వివరాలు, యూడైస్ వివరాలను పొందుపరచడం, ఉపాధ్యాయుల వేతన సంబంధించిన బిల్లులను చేసుకునేందుకు, ప్రభుత్వం అప్పచెప్పే ఆన్‌లైన్ వర్కులను నిర్వహించుకునేందుకు వీటిని వినియోగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వాటిని వెనక్కు తీసుకుంటే మేం ఏం చేయాలని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు.

వినియోగించుకునే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలి...



ప్రభుత్వం గతంలో వర్చువల్ క్లాసుల నిర్వహణ కోసం సరఫరా చేసిన ల్యాప్‌టాప్‌లను హైస్కూళ్లలోనే వినియోగించుకునే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలి. ఎందుకంటే ప్రభుత్వ ప్రతి కార్యక్రమం కూడా కంప్యూటర్ వినియోగం అనేది తప్పని సరి అయింది. ఈ తరుణంలో హైస్కూళ్లలో కంప్యూటర్స్ లేవు. అందువల్ల వర్చువల్ క్లాసుల కోసం సరఫరా చేసిన ఈ ల్యాప్‌టాప్‌లను పాఠశాల అవసరం కోసం వినియోగించుకుంటున్నాం.

– జి. వెంకటసుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు, కడప

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే...



రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ల్యాప్‌టాప్‌లను వెనక్కు తీసుకుంటున్నాం. గతంలో వర్చువల్ క్లాసుల కోసమని సరఫరా చేసిన వీటిని వెనక్కు తీసుకోవాలని ఇటీవల ఉన్నతాధికారులు ఆదేశించారు.

– మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

విద్యార్థి దశ జ్ఞానం భవిష్యత్తులో ఉపయోగకరం

సినీ నటుడు ప్రదీప్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, కళాశాల సిబ్బంది (ఇన్‌సెట్) సదస్సులో మాట్లాడుతున్న సినీ నటుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు కె.ప్రదీప్

కడప కోటిరెడ్డిసర్కిల్: విద్యార్థి దశలో పెంపొందించుకున్న జ్ఞానం భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరమని సినీ నటులు, వ్యక్తిత్వ వికాస నిపుణులు కె.ప్రదీప్ తెలిపారు. గురువారం కడప నగర శివార్లలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ప్రశ్న ఉదయిస్తే జ్ఞానం అవుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థిలో గెలవాలనే సంకల్ప బలం ఉండాలని, అంతర్గత క్రమశిక్షణను పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రతిభ, ఉత్సాహం అందరిలో ఉంటుందని, అయితే పట్టు పట్టి సాధించే వారు కొందరే ఉంటారని, అందులో తాను ఉండాలన్న ధృఢ సంకల్పంతో నేటి యువత ఆలోచించాలని సూచించారు. అన్నమాచార్య విశ్వవిద్యాలయ కులపతి డాక్టర్ చొప్ప గంగిరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి అవగాహన సదస్సులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలన్నారు. విద్యా సంస్థల వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులకు కాలానుగుణంగా సాంకేతికను అందిపుచ్చుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ఇలాంటి అవగాహన సదస్సులతో విద్యార్థులకు విద్యతోపాటు సృజనాత్మక పెరుగుతుందని, సామాజిక బాధ్యత అలవడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమల అవసరాలు తీర్చగలిగేలా విద్యావిధానం



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఎస్. రఘునాథరెడ్డి

వైవీయూ: పరిశ్రమల సమాజ అవసరాలు తీర్చేలా విద్యార్థుల్లో నైపుణ్యతను పెంచే దిశగా విద్యాలయాలు ప్రయత్నాలు ప్రారంభించాయని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణా రెడ్డి వెల్లడించారు. గురువారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని అన్నమాచార్య సెనేట్ హాల్‌లో 'ఉన్నత విద్య ప్రయోజనాలు, వ్యూహాలు సవాళ్లు, నైపుణ్యం-ఆధారిత పాఠ్యాంశాలు ' అనే అంశంపై రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్‌ను రిజిస్ట్రార్ ఆచార్య రఘునాథరెడ్డి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి వర్చువల్ విధానంలో హాజరై మాట్లాడుతూ ఉన్నత విద్యలో మార్కులు ప్రామాణికం కాదని నైపుణ్యత ముఖ్యమన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్ఈపీ–2020 విద్యారంగంలో ఒక మైలురాయి అన్నారు. ఈ విధానం ఎన్నో విప్లవాత్మక మార్పులను తెస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్య వక్త తిరుపతి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఆచార్యులు టి. సునీల్ కుమార్ మాట్లాడుతూ నైపుణ్య ఆధారిత విద్యా విధానం అమలు కావాలన్నారు. నేర్చుకునే విధానంలో ఆరు దశల గురించి విశ్లేషించారు. వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వి.ఐ.టి) ఆచార్యులు ఎస్.ఎం. ఫారూక్ 'ఉన్నత విద్యలో కృత్రిమ మేధ పాత్ర' గురించి వివరించారు. వర్క్‌షాప్ కన్వీనర్లు సైకాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. కె. లలిత, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. పి. సరిత, అప్లైడ్ మ్యాథమెటిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. సునీత వర్క్ షాప్‌ను సమన్వయం చేశారు. రిమ్స్ వైద్యురాలు డాక్టర్ యూనీస్ రాణి మాట్లాడుతూ నైపుణ్యాల లేమి నుంచి బయటపడడానికి మార్గాలను సూచించారు. కార్యక్రమంలో ఉప ప్రధాన ఆచార్యులు పి.పద్మ, డీన్‌లు ఆచార్య ఎ.జి.దాము, వై.సుబ్బరాయుడు, ఆచార్య జి. కాత్యాయని, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆర్‌సీపీ ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆర్‌సీపీ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను కొప్పర్తి నుంచి అమరావతికి తరలిస్తూ జారీ చేసిన జీఓ నెంబరు 56ను రద్దు చేయాలని, శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి తక్షణమే ఆపి నీటి మట్టాన్ని మినిమమ్ బ్యాలెన్స్ వరకు నిల్వ చేయాలని డిమాండ్‌చేస్తూ రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ 2006 చట్టానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం వివిధరంగాల్లో శిక్షణ నైపుణ్యత, మార్కెటింగ్‌ను అభివృద్ధి చేసేందుకు ఇలాంటి టెక్నాలజీ సెంటర్లను మంజూరు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే రూ. 250కోట్లతో కొప్పర్తికి మంజూరైందన్నారు. ఉపాధి కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల ఆశలపై ముఖ్యమంత్రి నీళ్లు పోసే విధంగా జీఓను తీసుకురావడం విచారకరమన్నారు. తక్షణమే జీఓ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీశైలంలో కరెంటు ఉత్పత్తి పేరుతో మూడు వారాల్లో 60 టీఎంసీల నీరు కిందికి వదిలేశారని పేర్కొన్నారు. శ్రీశైలంలో 215 టీఎంసీలు ఉండాల్సిన నీరు మంగళవారం ఉదయానికి 130 టీఎంసీలకు పడిపోయిందని తెలిపారు. రానున్న వేసవి కాలానికి 50 టీఎంసీలకు చేరుకున్నా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదన్నారు. రాయలసీమకు అన్యాయం చేయడం కోసమే ఉద్దేశపూర్వకంగా శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేస్తున్నారని ఆరోపించారు. రాయలసీమ ప్రజల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా టెక్నాలజీ సెంటర్ తరలింపు, శ్రీశైలం విద్యుత్ ఉత్పత్తి ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నగర కార్యదర్శి మగ్బూల్‌బాష, నాయకులు లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



సుదర్శన్ రాయల్‌ను పరామర్శిస్తున్న మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌టీయూసీ నాయకుడు సుదర్శన్ రాయల్ ఇంటిపై దాడి చేసిన జనసేన కార్యకర్తలను కఠినంగా శిక్షించాలని మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో సుదర్శన్ ఇంటిపై దాడి చేసిన విషయాన్ని వారు తెలుసుకొని గురువారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. సుదర్శన్‌కు ధైర్యం చెబుతూ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్ కుమార్, కార్పొరేటర్ పాకా సురేష్, నాయకులు దాసరి శివ, రమేష్ రెడ్డి , మునిశేఖర్ రెడ్డి, రామక్రిష్ణ పాల్గొన్నారు.

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం



నగరపాలక కార్యాలయంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ వైవో నందన్



విద్యార్థులతో కలిసి స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌జేడీ రవి

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ వైఓ నందన్ ఆధ్వర్యంలో అధికారులు 'స్వచ్ఛతా హి సేవ'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల్లోని అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో శ్రమదానం చేసి తమ కార్యాలయ పరిసరాలను శుభ్రపరుచుకున్నారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ కడప నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, పరిశుభ్రత మన ఆరోగ్యానికి, మన సమాజ అభివృద్ధికి ఎంతో కీలకమన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఇంజినీరింగ్ విభాగం, రెవెన్యూ విభాగం, ఎస్టాబ్లిష్మెంట్ విభాగం, హెల్త్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, నగరపాలక సిబ్బంది అందరూ తమ తమ సీట్లు, పరిసరాలను శుభ్రపరచి, వ్యర్థాలను తీసివేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, డీఈఈ కరిముల్లాఖాన్, ఏఈ అంజలి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చెప్పలి రాజారావు ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్మీడియట్ రీజనల్ డైరెక్టర్(ఆర్‌జేడీ) రవి హాజరై కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ రవి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే పర్యావరణం బాగుంటుందని, అప్పుడే మనందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐవో వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయ సేవల టోల్‌ఫ్రీ నంబర్ 15100

కడప అర్బన్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అందరికీ న్యాయ సేవలు అందజేయడానికి కృషి చేస్తోందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జి. శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉచిత న్యాయ సహాయానికి టోల్ ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు హెచ్‌టిటిపిఎస్ డాట్స్//డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు డాట్ ఎన్ఏఎల్ఎస్ఏ.జీఓవి డాట్ ఇన్/ఎల్ఎస్ఏఎంఎస్/లో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బహుమతి ప్రదానం

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని అంగడి వీధి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో టాప్ మార్కులు సాధించిన విద్యార్థికి నగదు బహుమతిని అందించారు. 2023–24 బ్యాచ్‌కు చెందిన విద్యార్థి దస్తగిరమ్మ పదవ తరగతిలో పాఠశాలలో మొదటి ర్యాంకు (542 మార్కులు) సాధించినందుకుగాను ఆ పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు పోత్తిరెడ్డి సుదర్శన్‌రెడ్డి.. హెచ్ఎం వెంకటేశ్వరరెడ్డి చేతుల మీదుగా రూ. 5,116 నగదును బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదర్శన్‌బాబు, ఉపేంద్ర, అగ్గీరప్ప, సుకుమారి, మాధవి పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

కడప అర్బన్: కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కందిపాలెంకు చెందిన సుబ్బరాయుడు, లక్ష్మిదేవిల కుమార్తె శ్రీవిద్య (14) ఈనెల 24వ తేదీ సాయంత్రం నుంచి కనిపించడంలేదని తల్లి గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు. తన తండ్రి సుబ్బరాయుడుతో పాటు వెళ్లిన శ్రీవిద్య తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

భార్యాభర్తలపై కేసు నమోదు

కడప అర్బన్: కడప నగరంలోని నబీకోట ప్రాంతంలో నివాసం వుంటున్న లక్ష్మిదేవి, శ్రీనివాసులు ఇద్దరు చీటీలను వేసి డబ్బులు చెల్లించాల్సిన సమయంలో చేతులెత్తేశారు. దీంతో బాధితులలో ఒకరైన సుబ్రమణ్యం తనకు రూ. 5లక్షల మేరకు ఇవ్వాలని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

ఫుట్‌బాల్ టోర్నీలో మూడో స్థానంలో కడప జట్టు



ఫుట్‌బాల్ టోర్నీలో మూడో స్థానం సాధించి ట్రోఫీ అందుకున్న కడప జిల్లా జట్టు

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి సీనియర్ బాలికల ఫుట్‌బాల్ టోర్నీలో కడప జట్టు మూడో స్థానంలో నిలిచింది. ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం, ఏపీ ఫుట్‌బాల్ సంఘం (ఏపీఎఫ్ఏ) సంయుక్త ఆధ్వర్యంలో కానూరులోని అనుమోలు ప్రభాకర్ ప్లే ఫీల్డ్‌లో మూడురోజులపాటు అత్యంత రసవత్తరంగా జరిగిన ఈ పోటీలకు 12 జిల్లాల జట్లు ప్రాతినిధ్యం వహించాయి. గురువారం ఉదయం జరిగిన రెండో సెమీఫైనల్స్‌లో కర్నూలు జట్టును శ్రీసత్యసాయి జిల్లా జట్టు 4–5 తేడాతో ఓడించి ఫైనల్స్‌కు చేరింది. అనంతరం జరిగిన ఫైనల్స్‌లో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా జట్ల మధ్య ఆసక్తికర పోరు నడిచింది.

అనంతపురం జట్టు క్రీడాకారులు అనూష రెండు గోల్స్ చేయగా, కాంచన, నందిని చెరో గోల్ చేశారు. తుదకు అనంతపురం జట్టు 4–0 తేడాతో ప్రత్యర్థి శ్రీసత్యసాయి జట్టును ఓడించి విజేతగా నిలిచింది. రన్నర్ ట్రోఫీని శ్రీ సత్యసాయి జిల్లా జట్టు దక్కించుకుంది. మూడో స్థానం కోసం సెమీస్‌లో ఓడిన కడప, కర్నూలు జట్లు తలపడగా, కడప 2–0 తేడాతో కర్నూలు జట్టును ఓడించి మూడో స్థానంలో నిలిచింది. విజేతలను నిర్వాహకులు అభినందించారు.

రిమ్స్‌ను సందర్శించిన జడ్జి



రిమ్స్‌లో వార్డులను పరిశీలిస్తున్న జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్

కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ తమ సిబ్బందితో కలిసి గురువారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల (రిమ్స్)ను సందర్శించారు. ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని సూచించారు. లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెంబర్ 15100 గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ గీత, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలుర గృహం పరిశీలన

జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ తమ సిబ్బందితో కడప నగరంలోని ప్రభుత్వ బాలుర వసతిగృహాన్ని, ప్రభుత్వ పరిశీలన గృహాన్ని పరిశీలించారు. పిల్లలు ఏఏ తరగతులను అభ్యసిస్తున్నారో తెలుసుకున్నారు. తరగతి గదులను, వంటశాలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జడ్జి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవలు పథకం 2015 వివరించారు. విద్య విలువైనదని, క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, దృష్టికి తీసుకుని రావచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహం సూపరింటెండెంట్ వీరయ్య, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ ఆఫీసర్ చెన్నారెడ్డి, వైద్యాధికారి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పెండ్లిమర్రి మండల అధ్యక్షుడిగా రమణా రెడ్డి



కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పెండ్లిమర్రి మండల అధ్యక్షుడిగా మాచవరం రమణారెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ పెండ్లిమర్రి మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకముంచి మండల అధ్యక్షుడిగా నియమించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

4న డిగ్రీ విద్యార్థులకు స్కిల్ కోర్స్ పరీక్ష

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలలో బిఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ కోర్సుల్లో 2వ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు అక్టోబర్ 4వ తేదీన స్కిల్ కోర్సు పరీక్ష నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటలకు ఉంటుందని విద్యార్థులకు సూచించారు. ఈ సమాచారాన్ని కళాశాలల నోటీసు బోర్డులో ప్రదర్శించాలని ప్రిన్సిపాల్స్‌ను ఆయన కోరారు.

జాతీయస్థాయి పోటీలకు గాంధీనగర్ విద్యార్థులు



జాతీయస్థాయి పోటీలకు పయనమైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీలు

కడప స్పోర్ట్స్ /కడప ఎడ్యుకేషన్ : ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు చెన్నైలోని జంగల్‌కట్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలకు కడప నగరంలోని గాంధీనగర్ నగరపాలకోన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల నరసరావుపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాఠశాలకు చెందిన క్రీడాకారులు లోకేశ్వర్, అజ్మతుల్లా, మణిదీప్, బన్నీలు చక్కటి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం పుష్పకుమారి తెలిపారు. గురువారం జాతీయస్థాయి పోటీలకు పయనమైన వారిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

రాయలసీమపై కక్ష సాధింపు మానుకోవాలి

కడప ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రాయలసీమ జిల్లాలపై కక్ష సాధింపు చర్య మానుకోవాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఇచ్చే ఎంఎస్ఎంఈ సెంటర్‌ను అమరావతికి తరలించే దుర్మార్గపు ఆలోచనలు విరమించుకోవాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్‌లు డిమాండ్ చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ .. రాయలసీమ జిల్లాల నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు లభించే విధంగా కడప జిల్లాలోని కొప్పర్తిని మెగా ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చాలని ప్రయత్నించారన్నారు. ఆ తర్వాత కొప్పర్తి హబ్‌గా ఏర్పడిన తర్వాత 2024– 25 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం కొప్పర్తి అభివృద్ధికి బడ్జెట్ కూడా కేటాయించిందన్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు కొప్పర్తిని అభివృద్ధి చేయకుండా ఇక్కడ ఉన్న ఎంఎస్ఎంఈ సెంటర్‌ను అమరావతికి తరలించడం తగదన్నారు. ప్రభుత్వం ఈ దుర్మార్గపు ఆలోచన విరమించుకోవాలని, లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.